# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎన్నికల గురించే చర్చ నడుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల లాభపడ్డ ప్రజలే రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నారు. ఏదో ఒకరకంగా ప్రతి కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందిందనేది వాస్తవం.**

ఇట్లా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు తమ ఓటు ఈసారి కూడా బీఆర్ఎస్‌కు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉండాలన్నదే వారి సంకల్పం అని స్పష్టంగా కనిపిస్తున్నది.



## గుండె గుండెలో గులాబీ జెండా

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నది. ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుండటంతో అవినీతికి ఆస్కారం లేదు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నది కాదన లేని సత్యం. రైతుబీమా లాంటి పథకం రైతు కుటుంబాలను ఆదుకోవడంలో ముందు వరుసలో ఉన్నది.

తాము అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను ఐదు వందలకే అందిస్తా మంటున్నది కాంగ్రెస్. అయితే ప్రస్తుతం తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ స్కీం ను ఎందు కు అమలు చేయడంలేదో వారు చెప్పడం లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత రాష్ట్రంలో త్రాగునీరుకు లోటు లేదు. మిషన్ భగీరథ నీరు గంగ పొంగినట్టు ఇంటి ముంగిళ్లలో పొంగుతున్నది. ఒకప్పుడు చెరువుల్లో నీరుండేది కాదు, ఇప్పుడు చిన్న చిన్న కుంటలు కూడా నీళ్లతో, చేపలతో కళకళలాడుతున్నయి. గ్రామాల్లో వ్యవసాయం పెరిగింది. అర ఎకరం ఉన్న రైతు కూడా ఇవ్వాల ఖాళీగా లేడు. రైతు బంధుతో అందరికీ సాయం అందుతున్నది. చేతి వృత్తులు తమ పునర్వైభవాన్ని పొందినై. గురుకులాలు, మాడల్ స్కూల్స్, ప్రభుత్వ స్కూల్స్‌లో పిల్లలు ఉచితంగా నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారు. అనేక రకాలుగా యువతీయువకులు ఉపాధి పొందుతున్నారు. ఆసరా పింఛన్ పొందిన ప్రతి తల్లి నా బిడ్డ కేసీఆర్ అంటున్నది. సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థులు స్వరాష్ట్రంలో సన్నబియ్యం తింటున్నరు. స్కూల్ యూనిఫాం, పుస్తకాలు చివరికి కాపీలు కూడా ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్నది.

> సాంకేతిక విద్యను అందించడంలో తెలంగాణ టాప్‌లో ఉన్నది. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం పెరిగింది. స్వరాష్ట్రం ఇరవై నాలుగు గంటల నాణ్యమైన కరెంటుతో వెలిగిపోతున్నది. ఇట్లా చెప్పుకుంటూ పోతే అనేక విషయాలున్నయి.

అనేక స్కాంలతో, స్కీంలతో ప్రజలను ముంచి, రాష్ట్రాలను అప్పులపాలు చేసి గ్రూపుల కొట్లాటలతో కుర్చీల కోసం తన్నులాటలతో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేయడం కాంగ్రెస్ నైజం.

కానీ, కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నరు. అది తెలంగాణను అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెట్టడం వల్లనే వచ్చింది తప్ప ఇంక దేనివల్ల కాదు. ఎప్పుడైనా ప్రజలకు చేసిన మంచి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి మాత్రమే నాయకులను గెలిపిస్తాయని, పార్టీలను అధికారంలోకి తీసుకొస్తాయి. అసత్య ప్రచారాలు, విమర్శల వల్ల ఒకటి రెండు సీట్లు గెలవొచ్చు కానీ అధికారాన్ని మాత్రం అందించ లేదు. ఈ సత్యాన్ని కాంగ్రెస్ తెలుసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.



జి. రాజేష్ నాయక్
96035 79115

# దొంగకు పగ్గాలియ్యాల్నట!

**తెలంగాణ సమాజం చైతన్యవంతమైనది. శతాబ్దాల చరిత్ర కలిగిన పోరాటాల గడ్డ. సామాజిక ఉద్యమాలైనా, అస్తిత్వ పోరాటాలైనా అలుపెరుగకుండా సాగించిన నేల. వందేమాతరం ఉద్యమమైనా, సాయుధ రైతాంగ తిరుగుబాటైనా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పోరాటమైనా విజయతీరాలకు చేర్చిన వీరులగన్న పోరు భూమి. అద్భుతమైన చరిత్ర మన సొంతం. ఇటువంటి నేలపై నేడు ఏం జరుగుతోంది? రాజకీయం పేరుతో జరుగుతున్న రాక్షస క్రీడ ఏమిటి? ఇటువంటి గడ్డపై చిల్లర నాటకాలు నడుస్తాయా?**

తెలంగాణ తల్లి దశాబ్దాల బానిస సంకెళ్లను తెంచేందుకు కేసీఆర్ చేసిన పోరాటం మన కండ్ల ముందున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సారథ్యంలో, ఆయన మార్గదర్శనంలో, ఉక్కు సంకల్పంతో అభివృద్ధి పథంలో మనం దూసుకుపోతున్నాం. బీడు వారిన నేలలు పచ్చగా మారినయి. మన బతుకుల్లో సంక్షోభం పోయి సంక్షేమం వచ్చింది. మన భావితరాలూ బాగుపడేలా తెలంగాణ సుభిక్షమైంది. పదేండ్ల ప్రస్థానంలో కేసీఆర్ సారథ్యం, ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణం నెలకొన్నది.

శాసనసభ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా కారు జోరు కనిపిస్తున్నది. 'తీస్రీ బార్ కేసీఆర్' అని సర్వత్రా జనం నినదిస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు అవాకులు చెవాకులు పేలిన కాంగ్రెస్ నాయకులు ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారు. ఈ ఫ్రస్ట్రేషన్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలో వెయ్యి రెట్లు కనిపిస్తున్నది. డిసెంబర్ 3 నాడు వచ్చే ఫలితాలు కండ్లముందు కనిపిస్తుంటే రేవంత్‌రెడ్డి కాళ్ల కింద నేల కదులుతోంది. చికెన్ సెంటర్ ముందుకెళ్లి తొడగొట్టిన కోడి చికెన్ సెంటర్ ఓనర్‌కే దొరికితే ఏం జరగొచ్చు? ఊహించుకుంటేనే సినిమా ఆ కోడికి అర్థమైపోతుంది.



ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్‌ను 'ఉరేసి, రాళ్లతో కొట్టి, పిండం పెట్టాల'ని ఇటీవల రేవంత్‌రెడ్డి అన్నాడు. సభ్యసమాజం ఈ వ్యాఖ్యలను హర్షిస్తుందా? పార్టీలు వేరైతే ఇలాంటి మాటలతో దూషించవచ్చా? ఏం సంస్కృతి ఇది? ఎక్కడ నేర్చుకున్న సంస్కృతి? కార్యకర్తలను కాళ్లతో తంతున్నాడు, కండువాలు వేసుకోవడానికి వచ్చిన కార్యకర్తలను తోసి పడేస్తున్నాడు. మరో వైపు... ప్రశ్నించే పాత్రికేయులకు సమాధానాలు చెప్పుకొనే పరిస్థితి లేక రెచ్చిపోతున్నాడు. తనదైన నీచమైన శైలిలో వారిపైనా దూషణలకు దిగుతున్నాడు. చానళ్లు న్యాయని రాస్తే 'పండవెట్టి తొక్కి పేగులు తీస్తా ఒక్కొక్క గాడిద కొడుకుల్ని' అన్నాడు. ఇలాంటివి ఒకటి కాదు, రెండు కాదు కోకొల్లలు. ఎక్కడపడితే అక్కడ, ఏది పడితే అది మాట్లాడుతున్నాడు.

ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో, చట్టసభలో ఉండాల్సిన వ్యక్తి మాట్లాడే భాష ఇలాగే ఉంటుందా? ఇది కేవలం ఆటవిక వ్యవహార శైలి మాత్రమే. రేవంత్ రెడ్డి పట్టపగలు డబ్బుల సంచులతో దొరికిపోయిన ఓ దొంగ. ఇది వాస్తవం కాదా? సీక్రెట్ కెమెరాల్లో రికార్డ్ కాకపోతే బుకాయించేవాడేమో. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును విఫల ప్రయోగం అని చిత్రీకరించేందుకు శత్రువులు కుట్ర చేశారు. తొలి ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు పూనుకున్నారు. అందుకు ఇంటిదొంగ రేవంత్‌రెడ్డిని వాడుకున్నారు.కానీ..కేసీఆర్ వ్యూహాల ముందు శత్రు శిబిరం ఆటలు సాగలేదు. దొంగలంతా బోనులో చిక్కారు. కటకటాలు లెక్కబెట్టారు.

దొంగతనం కేసులో దొరికి జైలుకు వెళ్లి వచ్చిన రేవంత్ రెడ్డి అప్పట్నుంచి వ్యక్తిగతంగా రగిలిపోతూ కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నాడు. కక్ష సాధించుకోవడమే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నాడు. రేవంత్‌రెడ్డి రాజకీయంలో ఎక్కడా కూడా ప్రజల ఎజెండా కనిపించదు. కేవలం తన దొంగతనాన్ని పట్టుకున్న కేసీఆర్‌పై పగ తీర్చుకోవాలనే అక్కసు, విపరీత ప్రవర్తన కనిపిస్తాయి. కేసీఆర్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా రాజకీయం చేస్తే...ఎప్పటికీ దింపలేరు. ప్రజలకు ఏం చేస్తారో చెప్పుకోవాలి. ఎవరికి ఓటు వేయాలో, ఎవరిని గద్దెనెక్కించాలో ప్రజలు నిర్ణయిస్తారు.



ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

> తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టే నేతలను ఓటుతోనే రాజకీయంగా అంతం చేయడం ప్రజలు నేర్చుకున్నారు. ఇక్కడ దొంగల ఆటలు సాగవు. రేవంత్ రెడ్డీ... నీకు అధికారం కావాల్నా? నువ్వొక పట్టపగలు దొరికిన దొంగవు. పండవెట్టి తొక్కుతనంటే పగ్గాలెట్ల ఇస్తాం?

(వ్యాసకర్త: జర్నలిస్టు)

# ఆశయానికే వేద్దాం మన ఓటు

> ప్రస్తుతం మనరాష్ట్రంలో జరుగబోయే ఎన్నికలను గమనిస్తే, ఆశకు, ఆశయానికి మధ్య జరిగే పోటీలాగానే కనిపిస్తున్నది. ఈ మధ్యనే నాకు వాట్సాప్‌లో వచ్చిన కొటేషన్ బాగా నచ్చింది. 'ఆశ ఉన్న వాడికి అధికారమిస్తే అంతా దోచుకు తింటాడు. కానీ ఆశయం ఉన్న వాడికి అధికారమిస్తే అభివృద్ధి చేసి చూపెడుతాడు' ఈ కొటేషన్ ఇప్పటి మన ఎన్నికలకు సరిగ్గా సరిపోతుంది.

ఒక పార్టీ నాయకుడు దార్శనికత, ఆశయం, తన రాష్ట్రాభివృద్ధిపై పట్టుదల,చిత్తశుద్ధి ఎంత ఉన్న దో గత పది ఏండ్లలో చూపెట్టిన వాడైతే, ఎన్నికల్లో పాల్గొనే ఇతర పార్టీల నాయకులకు ఈ రాష్ట్రాన్ని ఏకం గా కబళించుకుని, అధికార దాహాన్ని తీర్చుకుందామన్న ఆశనే ప్రస్ఫుటంగా కనబడుతున్నది. ఒక ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యే ముందే తన రాష్ట్రం తాను పాలిం చే 5 ఏండ్లలో ఎట్లా ఆవిష్కరించబడాలో ఒక క్రమబద్ధమైన ప్రణాళిక వేసి ఉంచుకోవాలి. అందుకోసం ఎన్నో పనిగంటల మేధోమథనం జరుగాలి. ఒక రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో ఉన్నతంగా నిలబెట్టాలన్న కాంక్ష ఉండాలి.

ప్రస్తుత జాతీయ పార్టీలకు ఒక జాతీయ విధానమంటూ ఉన్నట్టు అనిపించదు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధానం ఉండడం జాతీయత అనిపించుకోదు. సరే, ఒక్కొక్క రాష్ట్రానికి కావలసిన అవసరాలు వేరే ఉండి ఉండవచ్చు. అందుకనుగుణంగా స్థానిక అవసరాల్ని బట్టి అంత మేరకు విధానం భిన్నంగా ఉంటే సరి పోతుంది. కానీ స్థూలంగా ఉండే విధానంలో మార్పు ఉండకూడదు.

తాము ఎన్నిక కాగానే ఫలానా పనులు చేస్తాం, ఫలానా పథకాలు నెరవేరుస్తాం అని మ్యానిఫెస్టోలో పెట్టి, గెల్వగానే వాటిని ఖాతరు చేయకపోవడం, లేదా వాటిని సమూలంగా మార్పు చేయడం వెనుక, హోమ్ వర్క్ సరిగ్గా చేయకపోవడమన్నది స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. నేను ప్రస్తావిస్తున్నది కర్ణాటకలోని కాంగ్రెస్ గురించి అని అవలీలగా అర్థమై ఉంటదనుకుంటా. వారు అధికారంలోకి వచ్చిన రెండు మూడు నెలల్లోనే ఫెయిల్ అయ్యారంటే వాళ్లది అధికార దాహమే కానీ, ప్రజల క్షేమం కాదన్నది స్పష్టమవుతూనే ఉన్నది. తగుదునమ్మా అని అట్లాంటి నాయకులు తెలంగాణకు వచ్చి కాంగ్రెస్ కు ఓటు వెయ్యండని ప్రచారం చెయ్యడం ఎంత శోచనీయమో !

> కర్ణాటకలో ఐదు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా అమలు చేయలేకపోయింది. అలాంటి నాయకులు వందలాది సంక్షేమ పథకాలు అందిస్తున్న తెలంగాణకు వచ్చి ప్రచారం చేస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారు?

ఇంత గొప్ప ప్రగతి, ఇంత తక్కువ కాలంలోనే సాధించినందుకు ఎవరికైనా కన్ను కుట్టక మానదు. ఎవరికీ సాధ్యం కానిది కేసీఆర్‌కు ఎట్లయ్యిందని ఆయనపై కక్ష కట్టి, ఎలాగైనా ఓడించాలని, దేశ వ్యాప్తంగా ఉన్న నాయకులు, ముఖ్యమంత్రులు, చివరికి ప్రధాని మోదీ కూడా రాష్ట్రంపై దండయాత్ర చేస్తున్నారు. ఇదీ మన మంచికే అనిపిస్తుంది. వాళ్ల రాకతోనే వారి ఓటమి ఖాయమైందన్న వాస్తవం తెలుస్తున్నది.

ఆశయం ఉన్నతమైనదై, దాన్ని సాధించుకునేందుకు గుణాత్మక మైన మేధోమథనం చేయాలి. తగిన ప్రణాళికను తయారు జేసుకుని, కిందిస్థాయి ప్రజా ప్రతినిధులకు కూడా ఆ ఆశయాన్ని తెలియజేయాలి. అందరూ అదే దిశలో ప్రయాణించేట్టు చేసి, చిత్తశుద్ధితో ముందుకు పోతే ఆ నేతకు ప్రజలు జేజేలు పలుకుతారు. ఎల్లప్పుడూ వారినే ఎన్నుకుంటారనడంలో అనుమానమే లేదు. ఈ కోవకే చెందిన మన ముఖ్యమంత్రికి ప్రజలూ మద్దతు పలికి మూడోసారి ఎన్నుకుంటారనీ, ఆశ ఉన్నవారికి కాక, సదాశయం ఉన్నవారికే తమ ఓటు వేస్తారని ఆశిద్దాం. ముఖ్యమంత్రి హాట్రిక్ సాధిస్తారనీ నమ్ముదాం.



మాచెర్ల వాణీ మనోహర్
99896 20452

# పల్లెల ఆర్థిక వ్యవస్థ పటిష్టం

**తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలు పాలవెల్లులై నవ్వులు చిందిస్తున్నాయి. ఏండ్లకు ఏండ్లు బతుకు దెరువు కోసం వలస వెళ్లిన ప్రజలు ఇప్పుడు ఊర్లల్లోనే ఏదో ఒక పని చేసుకుంటూ సంతోషంగా జీవించడం మనం చూడవచ్చు. ఒకప్పుడు పని కోసం పట్టణాలను ఆశ్రయించిన ప్రజలు ఇప్పుడు పల్లెలనే అంటిపెట్టుకుని ఉండడానికి కారణం గ్రామాల్లో ఆర్థిక వనరులు మెరుగుపడటమే. అంతేకాకుండా పట్టణాల్లో ఉండే ప్రతి సౌకర్యం ఇప్పుడు పల్లెలకు కూడా వ్యాపించింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వస్తువులు గ్రామాల్లోనూ ఇంటింటికి చేరుతున్నాయి.**

గ్రామాల్లో ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రజలు వనరులను సమకూర్చుకుంటూ ఉండడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిగా మెరుగుపడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చేతి, కులవృత్తులతో అల్లుకుపోయిన జీవన విధానం. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత అవసరాలకు, కాలానికి తగ్గట్లుగా మార్పుకు నోచుకున్నది. విస్తరిస్తున్న వివిధరకాల వ్యాపారాలు, సేవలు ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ జీవనం, ఆర్థిక వ్యవస్థను సమగ్ర ప్రణాళికతో, ముందస్తు వ్యూహంతో పటిష్టపరిచారు. ఇంటికి దీపం ఇల్లాలు అన్న నమ్మికతో మహిళల అభ్యున్నతికి బాటలు పరిచారు. గ్రామాల్లోని మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించారు. పాడి పశువుల పెంపకం, కిరాణా దుకాణాలు, తదితర వ్యాపారాల్లో రాణించేందుకు ప్రోత్సహించారు.

గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఉపాధి హామీ పథకం కూడా ఒకటి. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడంలో సీఎం కేసీఆర్ అద్వితీయ విజయాలు సాధించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వహణ, కూలీలకు పని కల్పించడంలో తెలంగాణను ముందంజలో ఉంచారు. కేటాయించిన పనిరోజులను ముందుగానే పూర్తిచేసి అదనపు పని రోజులకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకున్నారు. దీంతో అదనంగా పని కల్పించిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఇందులో భాగంగా నీటి సంరక్షణ, మరుగుదొడ్ల నిర్మాణం, హరిత హారం, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యాలయాల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణంతో ఉపాధి కూలీలకు పని లభించింది. ఉపాధి పని సద్వినియోగం, కూలీలకు పని కల్పించడంలో పలు జిల్లాలు అవార్డులు సైతం సొంతం చేసుకున్నాయి. వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ప్రత్యేక వేసవి భత్యాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించి, పనిదినాలను, వేతనాలను కూడా పెంచారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లెలను ఆర్థికంగా పటిష్టం చేయడంలో సక్సెస్ అయ్యారు. ముఖ్యంగా చేతి, కుల వృత్తులకు జీవం పోశారు. ఉమ్మడి పాలనలో గ్రామీణ



జీవన విధానం విధ్వంసానికి గురైంది. వృత్తులనే నమ్ముకొని జీవించిన వారు వలసజీవులుగా మారిపోయారు. కానీ, తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో వృత్తులు మళ్లీ జీవం పోసుకున్నాయి. గొర్రెలు, చేపల పెంపకం, నాయీ బ్రాహ్మణ, రజక, చేనేత వృత్తుల వారికి సాయమందించి ప్రోత్సహిస్తున్నారు. ఆయా వృత్తులను ఆధునీకరించడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం లాంటి చర్యల ద్వారా దానిపై ఆధారపడిన వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు.

> గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోసేందుకు సీఎం కేసీఆర్ కులవృత్తులను ప్రోత్సహిస్తూ గొల్లకుర్మలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న గొల్లకుర్మలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఊపిరి పోసిందనే చెప్పవచ్చు.

ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందజేసి, బీమా సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఈ గొర్రెల పంపిణీ పథకంలో భాగంగానే పశుగ్రాసం కొరత ఏర్పడకుండా దాణా పంపిణీ చేస్తున్నారు. దీంతో మాంసం ఉత్పత్తి, వినియోగంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. మాంసం విక్రయాలతో వ్యాపారం చేసుకునే వారికి ఆర్థిక భరోసా కూడా ఏర్పడింది. గొర్రెల పంపిణీ తర్వాత రాష్ట్రంలో గొర్రెల సంతలు, మాంసం విక్రయాల మార్కెట్లు పెరిగాయి. గొర్రెల పెంపకం, మాంసం వ్యాపారంతో ఎంతో మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కులవృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న మరో అద్భుతమైన పథకమే ఉచిత చేపపిల్లల పంపిణీ. ఈ పథకం ద్వారా ఆయన నీలి విప్లవాన్ని తీసుకు వచ్చారు. చెరువులను విస్తరించడమే కాకుండా, ఆ చెరువులపై ఆధారపడి జీవించే కులవృత్తులవారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మంది మత్స్యకారులకు ఉపాధి లభించే ఏర్పాట్లు చేశారు. తెలంగాణ బీఆర్ఎస్ ప్రభు త్వం చెరువుల్లో చేపలను పెంచే గంగపుత్రులు, ముదిరాజులు, చేపల పెంపకందారులకు ఉచితంగా 100 శాతం సబ్సిడీతో చేప, రొయ్య పిల్లలను అందిస్తున్నది. కేజ్ కల్చర్, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఆధునీకరణ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి వీటిని వినియోగిస్తుంది. ఇప్పుడు గ్రామాల్లో చేపల విక్రయాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మత్స్య సంపదతో ఎంతోమంది ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

తెలంగాణలో కులవృత్తిపైనే ఆధారపడి జీవించే గీత కార్మికులకు నీరా పాలసీ, వైన్స్‌ల టెండర్లలో రిజర్వేషన్ వంటి పథకాలతో వారికి కూడా ఆర్థిక భరోసా ఏర్పడింది. రజకులు తమ వృత్తులను సాఫీగా కొనసాగించేందుకు ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణం, ఆధునిక యంత్రాలతో లాండ్రీల ఏర్పాటు, వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నది. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నది. కొత్తగా క్షౌర శాలలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సాయం, సెలూన్లకు విద్యుత్తు చార్జీల్లో మినహాయింపు వంటి వాటితో ఆయాకుల వృత్తుల వారు సంతోషంగా ఉన్నారు. ఇతర బీసీ కులాల్లోని చేతి వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం రూ.లక్షను అందజేసి, భరోసా కల్పిస్తున్నది.

చేనేతలకు సీఎం కేసీఆర్ చేయూతనందించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో చేనేతలు ఆకలి చావులు, ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఉన్నది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలతో వారు సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్, మంత్రి కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్ ప్రమోషన్‌తో ఈ రంగానికి ఆదరణ లభించింది.

ప్రతి సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు చేనేత వస్త్రాలను ధరించే విధంగా పిలుపునివ్వడం, ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాల ఆర్డర్లు చేనేతలకే ఇస్తున్నారు. బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంలో అందించే చీరలు, దుస్తుల ఆర్డర్లను కూడా వారికే ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్లో పోటీని తట్టుకోవడానికి తెలంగాణ స్టేట్ హ్యాండ్లూం వీవర్స్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి, విని యోగదారుల అభిరుచి, అంచనాలు, అవసరాలకు అనుగుణంగా దుస్తులను సిద్ధం చేసుకుని మార్కెట్లో దూసుకుపోతున్నది. ఇలా ఎంతో మందికి కులాల వారీగా, చేతి వృత్తిదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్.

సీఎం కేసీఆర్ తీసుకువస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో గ్రామాల్లోని ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇప్పుడు పట్టణాల్లోకి వలసలు వెళ్లి స్థిరపడిన వారు కూడా గ్రామాల్లో పెరుగుతున్న ఆర్థికవ్యవస్థ గ్రాఫ్‌ను చూసి అందుకు గల కారణాలను వెతుకాల్సిన పనిలో పడ్డారంటేనే అర్థం చేసుకోవచ్చు పల్లె ప్రజల జీవన విధానం ఏ విధంగా మెరుగుపడిందో.



రాపల్లి శోభన్ కుమార్
97055 54437

**కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో హామీలను పరిశీలిస్తే, ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవడమే ఆ పార్టీ లక్ష్యంగా కనిపిస్తున్నది. అధికారంలోకి రావడమే టార్గెట్‌గా, ఆ పార్టీ అమలు కానీ హామీలు ఇస్తున్నట్టు అర్థమవుతున్నది. మ్యానిఫెస్టోలో ఇష్టానుసారంగా హామీలు పొందుపర్చిన హస్తం నేతలు, అసలు వాటిని ఎలా నెరవేరుస్తారో చెప్పలేదు. రాష్ట్ర బడ్జెట్, హామీల అమలుకు అయ్యే ఖర్చుపై స్పష్టత ఇవ్వలేదు. మ్యానిఫెస్టోను బట్టి ఆ పార్టీ అనుకోకుండా అధికారంలోకి వస్తే రాష్ట్రం 'కుక్కలు చింపిన విస్తరే' అన్నట్టు తయారయ్యే ప్రమాదమున్నది.**

# కాంగ్రెస్‌ను నమ్మితే కుక్కలు చింపిన విస్తరే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014-15 ఆర్థిక సంవత్సరానికి అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. లక్ష కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2023-24 లో సుమారు రూ. 2.90 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ లెక్కన వచ్చే ఏడాది రూ. 3.10 లక్షల కోట్ల నుంచి రూ. 3.20 లక్షల కోట్లకు బడ్జెట్ చేరుకునే అవకాశమున్నది. ఈ బడ్జెట్‌తో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఎలా అమలు చేయగలదో కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వలేదు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీనికి కనీసం రూ. 25వేల కోట్లు అవసరమవుతాయి. రైతులకు , కౌలు రైతులకు రూ. 15వేల రైతు భరోసా, భూమి లేని రైతులకూ రూ. 12వేలు ఇస్తామని చెప్తున్నది. అంటే ఏటా 30-35 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే అవసరమవుతాయి. మరోవైపు రైతుబీమాను అమలు చేస్తే రూ. 1500 కోట్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తుకు ఏటా రూ. 15వేల కోట్లు , వరికి రూ. 500 బోనస్‌కు రూ. 15వేల కోట్లు అవసరమవుతాయి. వీటికే సుమారు రూ. లక్ష కోట్లు అవసరమవుతాయి.

6 గ్యారెంటీలలో భాగంగా ప్రకటించిన 'మహాలక్ష్మి'ని అమలు చేయాలంటే కనీసం రూ. 30వేల కోట్లు అవసరమవుతాయి. కుటుంబ పెద్ద అయిన ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ స్కీంకు ఏడాదికి రూ. 27వేల కోట్లు, రూ. 500కే గ్యాస్ ఇస్తే, ఈ సబ్సిడీని భరించాలంటే రూ. 400 కోట్ల భారం పడుతుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి రూ. 3వేల కోట్లు అవుతాయి.



చేయూత పింఛన్లకు ఏడాదికి రూ. 24వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. వీటికి తోడు 200 యూనిట్లలోపు గృహాలకు ఉచిత విద్యుత్‌కు రూ. 5వేల కోట్లు, నిరుద్యోగ భృతికి రూ. 2వేల కోట్లు, వధువుకు రూ. లక్ష సాయంతోపాటు తులం బంగారానికి రూ. 4వేల కోట్లు, అమరుల కుటుంబాలకు రూ. 25వేల పింఛన్, అంబేద్కర్ అభయ హస్తం, ఉచిత స్కూటీ లు, రూ. 10 లక్షల వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత సన్న బియ్యం, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, యువ వికాసంతో పాటు మరో వందకు పైగా హామీలను మ్యానిఫెస్టోలో చేర్చింది. వీటిని అమలు చేయాలంటే రూ. 6 లక్షల కోట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం మన రాష్ట్ర బడ్జెట్ రూ. 3లక్షల కోట్లు మాత్రమే.

ఈ నిధులతో ఇచ్చిన హామీలు అమలు చేయడం అసాధ్యమని కాంగ్రెస్ అగ్రనేతలకూ తెలుసు. కేవలం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవడానికి తప్ప అమలు చేయడానికి మా త్రం కాదని తెలుస్తున్నది. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే కర్ణాటక పరిస్థితి తప్పదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



దుండ్ర కుమారస్వామి
99599 12341